క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

గుడివాడరూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిసరాలను సిబ్బందితో కలసి ఆయనే స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలు చేయడం సులభమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని, వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

ఆలయానికి రూ.10,116 అందజేత

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం ముఖమండపం పునర్నిర్మాణానికి భక్తులు వితరణ అందజేసినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో పట్టణానికి చెందిన ఊర శ్రీధర్, శ్రీవల్లిదంపతులు రూ. 10,116 అందజేసినట్లు పేర్కొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ

కైకలూరు: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పరికాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.విద్యాసాగర్ సూచించారు. కలిదిండి వ్యవసాయ కార్యాలయం వద్ద 11 మంది రైతులకు సాగు కల్టివేటర్లను కూటమి నేతలు శనివారం అందజేశారు. ఒక్కో కల్టివేటర్ రూ. 43,350 ఉండగా సబ్సిడీ పోను రూ.21,675లకు అందిస్తున్నట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోకల జోగిరాజు, టీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లంకా రత్నారావు, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం ఎన్నిక

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా యూనిట్ ఎంపిక శనివారం జరిగింది. స్థానిక వెలమ సంక్షేమ సంఘం ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కె. దుర్గేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్. జోజి, జనరల్ సెక్రటరీగా బి. రాజేష్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఎంసీహెచ్ శ్రీనివాసన్, కోశాధికారిగా జి. రామారావు, ఉపాధ్యక్షులుగా ఎన్. భానుప్రకాష్, వి. క్రాంతికుమార్, డి.ఎస్. శిరీష, కె. దేవకీదేవి, డి. కుమార్ తదితరులు ఎంపికైనట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన తోట వర ప్రసాదు, ఎస్ఏఎస్ హుస్సేన్ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

గుడివాడరూరల్: వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్. చంటిబాబు, సిబ్బందితో కలసి వ్యభిచారం గృహంపై శనివారం దాడులు నిర్వహించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ కథనం మేరకు మల్లాయపాలెం పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో యలవర్తి లక్ష్మి అనే మహిళ గృహాన్ని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తోందన్న సమాచారంతో దాడి చేసి లక్ష్మి, ఆమెకు సహకరిస్తున్న కాకి జోసెఫ్‌తో పాటు మరో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విజయవాడకు చెందిన యువతితో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, బైక్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తాను కేసు నమోదు చేయగా తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

కొండిపర్రు(పామర్రు): గ్రామంలోని ధర్మ చెరువు సంస్థ తరపున బాటసారులకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ పేర్కొన్నారు. మండలంలోని కొండిపర్రు గ్రామం అడ్డరోడ్డు వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే శనివారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పూర్వ కాలం గ్రామానికి చెందిన దాతలు గ్రామంలో 6.15 ఎకరాల చెరువును తవ్వించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో బాటసారులకు మంచినీటిని అందించే చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ వారిని కోరటం అభినందనీయమన్నారు. గ్రామస్తులు నూకారపు ఆంజనేయులు, మద్దంశెట్టి సత్యం, పసుపులేటి విజయకుమార్, కిరణ్, చిరంజీవి, రావయ్య, ఈశ్వరరావు, పాండు రంగారావు, ఆలయ ఈఓ వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

వరి పొలాలను మింగేస్తున్న చేపల చెరువులు

- నానాటికి తగ్గుతున్న పంట విస్తీర్ణం
- పచ్చని పైర్లు ఆక్వా చెరువులుగా రూపాంతరం



కలిదిండి మండలంలో ఆక్వా చెరువులుగా మారుతున్న వరి పొలాలు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో పచ్చని పంట పొలాలను చేపల, రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. సాధారణంగా కొల్లేరు పరివాహక గ్రామాల్లో ఆక్వా సాగు అధికంగా ఉంటుంది. మిగిలిన ప్రాంతాల్లో వరి, అపరాలుగా మినుము సాగు చేస్తున్నారు. దాళ్వా పంట లేకపోవడం, కాల్వల నుంచి సకాలంలో సాగు నీరు రాకపోవడం, వాతావరణ మార్పులు, తుపానులు, చీడపీడలు కారణంగా వ్యవసాయ రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. పంట పొలాలను బడా బాబులు చేపల చెరువులుగా తవ్వేస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించడం లేదు.

పచ్చని పైర్లు మాయం

నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో కలిపి వ్యవసాయ సాగు విస్తీర్ణం 22,493 ఎకరాల్లో ఉంది. మొత్తం 10,766 మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక ఆక్వా చేపల, రొయ్యల చెరువుల విషయానికి వస్తే నాలుగు మండలాల్లో 104 గ్రామాల్లో అత్యధికంగా 84,775.88 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. ముదినేపల్లి మండలంలో పూర్వం 25 వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయసాగు ఉండేది. ఇప్పుడు 15,000 ఎకరాలకు పడిపోయింది. కలిదిండి మండలంలో గతంలో 3,000 ఎకరాలు నేడు కేవలం 1,493 ఎకరాలకు చేరింది. ఈ మండలంలో రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడిగా వరి రైతులు సాగు చేస్తున్న పొలాల మధ్యలో ఒక రైతు చేపల చెరువుగా మార్పు చేస్తే, మిగిలిన వ్యవసాయ పొలాలు పంట పండని పరిస్థితి. దీని సాకుగా చూపిస్తూ దిగుబడులు ఇచ్చే పొలాలను సైతం ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నారు.

కష్టానికి ప్రతిఫలం నిల్

నియోజకవర్గంలో దాళ్వా సాగు లేదు. సాధారణంగా ఒక వ్యవసాయ రైతు ఎకరం పొలానికి రూ.25వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే సుమారు 32 బస్తాలు పండుతున్నాయి. ప్రస్తుత మార్కెట్‌ను బట్టి రూ.45,000 ఆదాయం వస్తే అందులో 10 బస్తాలు కౌలు కింద తీయాల్సి వస్తోంది. అంటే రైతుకు చివరకు రూ.30,000 మిగులుతుంది. వాతావరణం అనుకూలించకపోతే అది కూడా ఉండదు. వచ్చిన ఆ కాస్త సొమ్ము కూడా వడ్డీలకు సరిపెట్టాల్సి వస్తోంది. అపరాల సాగు కూడా అంతంతమాత్రంగానే ధర పలుకుతోంది. ఆక్వా సాగులో ఎకరం చెరువులో 3,000 చేప పిల్లలు వేసి పెంచితే రూ.2.50 లక్షల పెట్టుబడికి నాలుగు టన్నుల వరకు చేపలు పెరుగుతున్నాయి. 10 నెలల పంట కాలంలో ఒక చేప గరిష్టంగా 1,000 గ్రాముల నుంచి 1,200 గ్రాములు పెరుగుతుంది. చివరకు రైతుకు రూ.2.5 లక్షలు వస్తుంది. రొయ్యల సాగు సరిగ్గా పెంచితే లాభాలు మరింతగా పెరుగుతాయి. ఈ కారణంగా వరి రైతులు ఆక్వా చెరువుల వైపు మొగ్గు చూపుతున్నారు.



తామరకొల్లులో పచ్చని వరిపొలాలు

వరి ఉత్పత్తులు తగ్గటం ఆందోళనకరం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ధాన్యగారంగా పిలిచేవారు. వీటిలో ఉభయగోదావరి జిల్లాలు ప్రత్యేకం. నేడు ఆక్వా రంగం విస్తరించింది. దీని వల్ల ఆహార పంటలైన వరి ఉత్పత్తులు తగ్గుతున్నాయి. ఆక్వా సాగుతో పాటు వరి సాగును ప్రోత్సహించాలి. వ్యవసాయ పంటలను అధికంగా ఆక్వా చెరువులుగా మార్చేస్తే భవిష్యత్తు తరాలు ఇబ్బందులు పడతారు.

– డాక్టర్ ఎం.హరిప్రసాద్, హెచ్ఓడీ, హిస్టరీ, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కైకలూరు

వలసలు పోతున్నాం



మండలంలో రోజురోజుకు ఆక్వాసాగు పెరుగుతోంది. వరిసాగు తగ్గిపోతోంది. దీంతో మా లాంటి రైతులు, కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆక్వా సాగు వల్ల పనులు లేక పొట్ట చేతపట్టుకుని వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే మండలంలోని వి.రావిగుంట గ్రామ ఆయకట్టు మొత్తం చేపలచెరువులుగా మారడంతో ప్రజలంతా పనులు కోసం వలసలు పోతున్నారు.

– ఆనందదాసు నాగరాజు, రైతు, చేవూరుపాలెం

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

మొవ్వ: మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం జనరల్ కోర్సులలో 92 మందికి 80 మంది ఉత్తీర్ణులై 87% ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.సుధాకర్‌బాబు తెలిపారు. శనివారం ఇంటర్మీడియట్ మొదటి, రెండు సంవత్సరాల పరీక్ష ఫలితాలు విడుదలైన సందర్భంగా కాలేజీ పరీక్ష ఫలితాలను ఆయన వెల్లడించారు. మొదటి సంవత్సరం జనరల్ కోర్సులో 106 మంది పరీక్షలకు హాజరైతే ఆరుగురు పీహెచ్‌సీ విద్యార్థుల ఫలితాలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. 100 మందికి గాను 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. వృత్తి విద్యా కోర్సుల విభాగంలో మొదటి సంవత్సరం 78 మందికి 75 మంది ఉత్తీర్ణతతో 96% సాధించామని తెలిపారు. అలాగే రెండో సంవత్సరం 45 మందికి 44 మంది పాసై 98% ఉత్తీర్ణత పొందినట్లు పేర్కొన్నారు.

కళాశాల ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు వీరే..

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో బైపీసీ గ్రూపులో 973/1000 కంచర్ల మురళీధర్ మొదటి స్థానం, వృత్తి విద్యా విభాగంలో ఏ అండ్ టీ గ్రూపులో మెరుగు మాల మేఘన 972 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంపీసీ గ్రూపులో 942 మార్కులతో కాపు దాసి శ్రీలేఖ, సీఈసీలో ఎం.సలోమి 864 మార్కులు సాధించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫలితాలను శనివారం వెల్లడించారు. మొదటి సంవత్సరంలో 14మందికి 11మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జగన్మోహనరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 10 మందికి ఎనిమిది మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

కైకలూరులో..

గుడ్లవల్లేరు: కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 112 మందకి 71 మంది, ప్రథమ ఇంటర్‌లో 121 మందికి 44 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో బి.దుర్గా నాగసాయి (ఎంపీసీ 940/1000), ఒకేషనల్‌లో బి.శ్రావణి (918/1000), బైపీసీలో బి.సంజయకుమారి (914/1000), ప్రథమ ఇంటర్ ఒకేషనల్‌లో ఎం.కాశేశ్వరరావు (468/500), బైపీసీలో కె.చరణ్ (408/440) కాలేజీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి అభినందించారు.

మండల ప్రథమ స్థానంలో భుజబలపట్నం

భుజబలపట్నం జెడ్పీహెచ్ఎస్ ప్లస్ ప్రభుత్వ బాలికల కాలేజీ ఇంటర్ విద్యార్థినులు ప్రతిభ చూపి మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించారు. ప్రథమ ఇంటర్‌లో 29 మందికి 19 మంది, ద్వితీయ ఇంటర్‌లో 12 మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్ బైపీసీలో వడుపు చాందిని (952/1000), కటికాల దైవకృప(923/1000), నిర్మలాకుమారి (914/1000), సీఈసీ ద్వితీయ ఇంటర్‌లో సుభాషిణి (756/1000), ప్రథమ ఇంటర్ బైపీసీలో పోతుమూడి కీర్తి నాగభవానీ(429/440), మేడపాటి జెస్సీ (400/440), ప్రథమ ఇంటర్ సీఈసీలో జల్లూరి నిఖిల (424/500), కొనాల సింధు (415/500)తో ఉత్తీర్ణత సాధించారు. వీరిలో వడుపు చాందిని, పోతుమూడి కీర్తి నాగభవానీలు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. వీరిని హెచ్ఎం ఎస్ఎల్ రాజ్యలక్ష్మి అభినందించారు.

విజ్ఞాన్ కాలేజీలో..

కైకలూరు విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ప్రథమ ఎంపీసీలో ఎండీ.సమ (463/470),బైపీసీలో అవినాష్ (913/440), ద్వితీయ ఇంటర్ ఎంపీసీలో పీఎస్ వరలక్ష్మి (928/1000), బైపీసీలో జి.పూజిత (912/1000), పలువురు ఉత్తీర్ణత సాధించారు. వీరిని కరస్పాండెంట్ జి.పాండురంగారావు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్ష ఫలితాల్లో గుడివాడ శ్రీ చైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ సీహెచ్. వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం అల్లు కుమారస్వామి 465/470, కంచర్ల రత్నశ్రీ 465/470, దాసరి హోలీ అర్పిత 434/440, ద్వితీయ సంవత్సరం గొల్లపల్లి దేదీప్యాసాయి 991/1000, యు.హుషాప్రియ 991/1000, జి.వైష్ణవి 990/1000 మార్కులు సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

- ఆర్కే జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జె. మానీష 444/500 మార్కులతో సీఈసీలో టౌన్ ఫస్ట్ ర్యాంక్, జి. గీతాలహరి 452/500, సీనియర్ ఇంటర్‌లో బి. స్రవంతి , బి. గోకుల్‌సాయి, ఎ. నిరీషాప్రియ ఉత్తమ మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణబాబు తెలిపారు. విద్యార్థులను డైరక్టర్ ఎ.అనూష అభినందించారు.

స్వచ్ఛమైన తాగునీటికి చర్యలు

గుడ్లవల్లేరు: సింగలూరులో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు గ్రామ పంచాయతీ సహకారంతో చర్యలు చేపట్టినట్లు ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. శనివారం గ్రామంలోని తాగునీటి బావులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నందం శ్రీనివాసరరావు, మాచర్ల రమణయ్య, ఆకురాతి రాఘవయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్. రాజశేఖర్ శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన డి.నాగపద్మ క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో వైద్యసేవల నిమిత్తం రూ. 31 వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు, కోశాధికారి ప్రసాదు, పూర్వ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీహర్ష, శంకరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించండి

గుడివాడ టౌన్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొంగులేటి జయరాజు కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ చిత్రపటానికి ఉదయం 10.30 గంటలకు నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

కోదండ రామాలయంలో అన్నసమారాధన

కైకలూరు: కుమారి టాకీస్ సెంటర్ డాక్టర్ అప్పారావు వీధిలో ముఠా వర్కర్ల ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో శ్రీరామనవమి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆఖరి రోజు శనివారం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కైకలూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన ఆటపాక సెంటర్‌లో శనివారం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ స్వామి కథనం మేరకు వదర్లపాడుకు చెందిన సాగర్ ఆటపాక ఐస్ ఫ్యాక్టరీలో పనిచేస్తాడు. పని ముగించుకుని గొల్లగూడెం అత్తవారి ఇంటికి వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆటపాక మలుపు వద్ద భుజబలపట్నంకు చెందిన సాయి అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాగర్‌కు కాలు విరిగింది. కైకలూరులో ప్రథమ చికిత్స చేసి ఏలూరు రిఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేసవి శిక్షణ తరగతులు వినియోగించుకోండి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, రంగప్రసాదు

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు పాల్గొని వివిధక్రీడల్లో శిక్షణ పొందాలని ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు కోరారు. శనివారం స్టేడియం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మే ఒకటి నుంచి 28వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, శాస్త్రీయనాట్యం, చెస్, క్రికెట్, కబడ్డీ, కరాటే, ఖో-ఖో, షటిల్, స్కేటింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, వెస్టన్ డ్యాన్స్, యోగా తదితర అంశాల్లో నిష్ణాతులైన కోచ్‌ల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు, శాస్త్రీయ నాట్యం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలి పారు. ఈనెల 16 నుండి 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రూ. 5 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం శిక్షణ సమయంలో పౌష్టికాహారం అందించనున్నట్లు పేర్కొ న్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాదు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్


వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడి ముక్కల): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని అయినంపూడి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అనిల్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆదర్శమూర్తి అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ అడుగు జాడల్లో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అంబేద్కర్ యువజన సంఘ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా వీరమ్మ తల్లి సంబరాలు



వేషధారణ



ఊరేగింపులో వీరమ్మ తల్లి ప్రభలు

గుడ్లవల్లేరు: వందేళ్ల చరిత్ర కలిగిన మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి సంబరాలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయంలో పొలీల్ని కట్టి, వసంతోత్సవం ఆడి, అమ్మవారిపై తమ భక్తిని చాటుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు అమ్మవారి ఊరేగింపులో తల్లి ప్రభలను ఏర్పాటు చేశారు. ఊరేగింపులో చిత్ర విచిత్ర శక్తి వేషధారణలు, కనకడప్పుల వాయిద్యాలు, కోలాటాలతో ప్రభలకు అలంకరించిన విద్యుద్దీపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలను చేశారు. సంబరాల్లో వేలాది మంది భక్తులకు నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కైకలూరు: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కైకలూరు టౌన్ పోలీసుల కథనం మేరకు స్థానిక యానాదుల కాలనీ సమీప కాల్వగట్టుపై పెద్దింటి అజయ్ (40) తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకి భార్య, ఇరువురు సంతానం. అజయ్ మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవలు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 9న భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగడంతో పురుగుల మందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతడి భార్య కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

వెంకటేశ్వరస్వామికి మొక్కుల చెల్లింపు



భక్తులకు అన్న సమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల రద్దీ అధికమైంది. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

విప్లవ ఉద్యమకర్త కొండపల్లి

గుడివాడ టౌన్: మన దేశంలో కమ్యూనిస్టుల విప్లవ ఉద్యమానికి దశ, దిశ రూపొందించిన గొప్ప వ్యూహకర్త కొండపల్లి సీతారామయ్య అని విరసం సీనియర్ నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో కొండపల్లి సీతారామయ్య వర్ధంతిని పురస్కరించుకుని కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి సీతారామయ్య అనగానే విప్లవ కారుడుగానే అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, కార్యదర్శి రివేరా, బహుజన న్యాయ పోరాట కమిటీ కార్యదర్శి ప్రిన్సెస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఇశ్రాయేల్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించండి

కూచిపూడి(మొవ్వ): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను ఈ నెల 14న ప్రశాంత వాతావరణంలో నిర్వహించి, శాంతి భద్రతలకు సహకరించాలని పామర్రు సీఐ సుభాకర్, కూచిపూడి ఎస్ఐ కేఎస్ విశ్వనాథ్ కోరారు. కూచిపూడి పోలీస్ స్టేషన్లో శనివారం పలు గ్రామాలకు చెందిన యువజన సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆ వేడుకలు నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో జరుపుకోవాలని, పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం అంబేడ్కర్ కమిటీ సభ్యులు, యువతతో జయంతి ఉత్సవాల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. తటివర్రు గ్రామ అంబేడ్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి విశ్వేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీగంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదికపై ఉంచి అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కాల్వల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ముదినేపల్లి రూరల్ : పంట, మురుగు కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చేవూరు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కారిన ప్రసాద్ అధికారులను కోరారు. మండలంలోని ముదినేపల్లి నీటి పారుదల శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి పారుదలశాఖ ముదినేపల్లి సెక్షన్ ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శనివారం వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిన్నం మాధవ్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని మాధవ్ కోరారు.

సినీ నటుడు గగన్‌బాబుకు సన్మానం



పామర్రు: ప్రముఖ సినీ నటుడు పామర్రు గ్రామానికి చెందిన కోటి గగన్ బాబును స్థానిక ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక హితమ్ స్కూల్లో సన్మానించారు. కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, హేమంత్‌రెడ్డి, సభ్యులు విజయలక్ష్మీ, తనూజ, బేబి పాల్గొన్నారు.

మన్ననలు పొందుతున్న గగన్‌బాబు

పలు సినిమాల్లో సైడ్ విలన్ పాత్రలో తనదైన శైలిలో నటిస్తూ అందరి మన్ననలు పొందుతున్న కోటి గగన్ బాబు శనివారం పామర్రులో సందడి చేశారు. తన బంధువుల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి' కొద్ది సేపు ఆయనతో ముచ్చటించింది. తాను ఇప్పటికి సుమారు 25 సినిమాల్లో నటించినట్లు తెలిపారు. ప్రస్తుతం అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న '12 ఏ రైల్వే స్టేషన్ ' సినిమాలో నటిస్తున్నట్లు పేర్కొన్నారు.